సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



'ఓపెన్' ఆఫర్

ఓపెన్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 27 వరకు అవకాశం ఉంది. - 8లో



నేటి నుంచి ప్రాక్టికల్స్

ఇంటర్ ప్రాక్టికల్స్ నేటి నుంచి మొదలుకానున్నాయి. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. - 8లో

పాడి రైతుల కోసం పశు విజ్ఞానబడి

కవిటి: పాడి రైతులకు సమగ్ర వైద్య, సాంకేతిక సహాయాన్ని అందిస్తూ లాభసాటి పాడిపరిశ్రమ నిర్వహణే లక్ష్యంగా పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని టెక్కలి పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. శనివారం తలగానపుట్టుగలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి.శిరీష అధ్యక్షతన పశు విజ్ఞానబడి కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ, ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలు వివరించారు.

న్యూస్‌రీల్

స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధి శిక్షణ సంస్థ, ప్రధాన మంత్రి కౌశల్ వికాస యోజన, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లోని స్కిల్ హబ్‌లో నిర్వహిస్తున్న స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు చెప్పారు. ఐటీఐలో శనివారం వివరాలు వెల్లడించారు. ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ 4 నెలలు, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ 3 నెలల కోర్సులుగా చెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తిచేసి, 18 నుంచి 30 మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని చెప్పారు. బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. రెండు బ్యాచ్‌లకు 60 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల చివరి నాటికి దరఖాస్తు చేసుకోవాలని, 30 దరఖాస్తులు వచ్చిన వెంటనే బ్యాచ్ శిక్షణ ప్రారంభిస్తామని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 10వ తరగతి ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని చెప్పారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 7989177887ను సంప్రదించాలని చెప్పారు.

సమావేశానికి ఆహ్వానం



జెడ్పీ సీఈఓ వెంకట్రామన్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఏపీజీఈఏ నేతలు

అరసవల్లి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం మార్చి 1న జిల్లా కేంద్రంలోని గ్రాండ్ హోటల్‌లో నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి హాజరుకావాలంటూ జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్‌ను ఉద్యోగ సంఘ నేతలు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం జెడ్పీ సీఈఓతో పాటు పలు శాఖాధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజేశ్వరి మాట్లాడుతూ ఈ సర్వసభ్య సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కార రావులు రానున్నారని తెలిపారు.

'వందశాతం ఉత్తీర్ణత సాధించాలి'



లంకపేట కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర అసిస్టెంట్ జీసీడీఓ సుసన్

రణస్థలం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న టెన్త్, ఇంటర్ విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర అసిస్టెంట్ జీసీడీఓ మేరీ సుసన్ అన్నారు. మండలంలోని లంకపేట కేజీబీవీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ రికార్డులు పరిశీలించి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జీసీడీఓ శోభ, ప్రిన్సిపాల్ ఎస్.హైమావతి, సిబ్బంది ఉన్నారు.

59 మద్యం బాటిళ్లతో ఇద్దరు అరెస్ట్

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర చెక్ పోస్టు వద్ద ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టెక్కలి ఎస్ఈబీ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని వసుంధర చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు 59 మద్యం బాటిళ్లను టెక్కలి తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిని కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

వెయ్.. దరువెయ్



ఊరిలోని థియేటర్‌కు హీరో హీరోయిన్లు వచ్చారు.. డప్పుల దరువు అదిరిపోవాలి. పెళ్లి ఊరేగింపు యమా జోరుగా జరుగుతోంది.. తీన్‌మార్ మేళం మోతెక్కిపోవాలి. ప్రజా ప్రతినిధి గెలిచి ఊరికొస్తున్నాడు.. కార్యకర్తల సంతోషానికి డప్పు సౌండ్ మ్యాచ్ చేయాలి.

వినాయక నిమజ్జనం, దేవీ విగ్రహాల అనుపు ఉత్సవం, ఊరి సంబరాలు.. వేడుక ఏదైనా ఆడే వేదిక మాత్రం తీన్‌మారే. జిల్లాలో ఒకప్పటి పాపులర్ సత్రసాగర్ డప్పు కళాకారులు ఇప్పుడు తీన్‌మార్ మేళంగా మారారు. వారికి ఇంకా చాలా మంది జత కలిశారు. నాటి కళకు నేటి దరువును జత చేస్తూ ఫంక్షన్లలో జంక్షన్లు జామ్ చేస్తున్నారు.



శుభకార్యంలో తీన్‌మార్ డప్పుల బృందం ప్రదర్శన

- ఫంక్షన్ ఏదైనా తీన్‌మార్ మోత మోగాల్సిందే
- నాటి సత్రసాగర్ డప్పు మేళమే నేటి తీన్‌మార్ ధూమ్ ధమాకా
- దుమ్ము లేపుతున్న డప్పు కళాకారులు

సండే స్పెషల్

కంచిలి:

తీన్‌మార్.. శుభకార్యం ఏదైనా తప్పనిసరిగా కనిపించాల్సిన, వినిపించాల్సిన పేరు. పార్టీ అయినా, ఫంక్షన్ అయినా ప్రోగ్రామ్ సక్సెస్ అవ్వాలంటే ఈ దరువు పడాల్సిందే. ఒకప్పుడు పెద్దపెద్ద ఫంక్షన్లు నిర్వహించే వారు స్వాగత ద్వారం వద్ద ఈ డప్పు వాయిద్యాలను పెట్టి అతిథులను స్వాగతించేవారు. కాలక్రమేణా ఇది అన్ని శుభకార్యాల్లోనూ తప్పనిసరి గా మారిపోయింది. రాజకీయ పార్టీ ర్యాలీ, జాతర, తిరునాళ్లు, మిగతా మంచి కార్యక్రమాల్లో తీన్‌మార్ దరువేయడం కామనైపోయింది. ఇదంతా ఒక ఎత్తయితే ప్రత్యేకించి తీన్‌మార్ ధూమ్‌ధమాకా అంటూ డప్పు వాయిద్యాల ప్రోగ్రాం మరొక ఎత్తు. ఇవి లేకపోతే ఇప్పుడు సండడే ఉండడం లేదు. జిల్లాలో కంచిలి మండలం గోకర్ణపురం గ్రామానికి చెందిన 'తీన్‌మార్ ధూమ్ ధమాకా' డప్పు వాయిద్యాలకు మంచి పేరుంది. ఈ ప్రాంతంలో ఎలాంటి శుభకార్యక్రమాలైనా వీటిని తప్పనిసరిగా పెడుతుంటారు. పెద్ద శబ్దంతో కూడిన ఈ డప్పుల మోత అన్ని వయసుల వారి చేత స్టెప్పు లేయిస్తుంది. ఉద్దానం ప్రాంతంతోపాటు జిల్లాలోను వివిధ ప్రాంతాల వారు ఈ డప్పు వాయిద్యాలను బుక్ చేస్తుంటారు. గోకర్ణపురం గ్రామానికి చెందిన ఈ వాయిద్యకారులు పూర్వీకుల నుంచి 'ఢంకాలు' వాయించేవారు. ప్రస్తుత తరంవారు కొద్దిగా డిఫరెంట్‌గా ఆలోచించి, ఈ డప్పులను రూపొందించి, కొత్తరకమైన సౌండ్స్ వచ్చేలా సిద్ధం చేశారు. 18 ఏళ్లుగా వీరు ఈ తరహా కార్యక్రమాలతో ఉపాధి పొందుతున్నారు. శుభకార్యాలకు పెట్టే ఖర్చుకు తగినట్టుగా వారి ప్రోగ్రాం ధరలను కూడా నిర్ణయించి, సేవలందిస్తున్నారు.

ఈ డప్పులను శ్రీకాకుళం, నరసన్నపేట, పోలాకి తదితర దూరప్రాంతాల వారూ బుక్ చేస్తుంటారు. వీరు ఒక ప్రోగ్రాంకు పది మంది సభ్యులు హాజరై రకరకాల సినిమా పాటలు, ఆల్బమ్ పాటలు, లోకల్ పాటలు వాయిస్తూ యువతను ఉర్రూతలూగిస్తారు. గోకర్ణపురం గ్రామాన్ని గతంలో సత్రసాగర్ అనే పేరుతో పిలిచేవారు. దీంతో ఈ డప్పులకు సత్రసాగర్ డప్పులు అని కూడా స్థానికంగా పిలుస్తుంటారు. ఈ గ్రామంలో 7 బృందాలు ఈ వృత్తిలో ఉన్నాయి. వీరితోపాటు సోంపేట మండలం పొత్తంగి గ్రామంలో కూడా మరో రెండు బృందాలు ఉన్నాయి.

మంచి ప్రోగ్రామ్స్ వస్తున్నాయి..



తీన్‌మార్ ధూమ్ ధమాకా డప్పుల ఈవెంట్‌కు ఈ ప్రాంతంతోపాటు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి మంచి ప్రోగ్రామ్స్ వస్తున్నాయి. మేము ఇచ్చే ప్రదర్శనలతో యువతరం ఉత్సాహంగా డ్యాన్స్ వేస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఇది ఎంతో సంతృప్తినిస్తోంది.

– రవి, తీన్‌మార్ ధూం ధమాకా డప్పు బృందం వాయిద్యకారుడు, గోకర్ణపురం గ్రామం, కంచిలి మండలం

పూర్వీకుల నుంచి..



సత్రసాగర్ (గోకర్ణపురం)లో ఉంటూ మా పూర్వీకుల నుంచి ఇదే వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నాం. మా తరం వచ్చేటప్పటికి ఇప్పటి జీవన శైలికి తగినట్లుగా డప్పు వాయిద్యాలను మార్పుచేసి తీన్‌మార్ ధూం ధమాకాగా రూపొందించాం. పది మందిని ఒక బృందంగా ఏర్పాటు చేసుకొని ప్రోగ్రామ్స్ ఇస్తున్నాం.

– సత్తు శ్రీనివాసరావు, తీన్‌మార్ ధూం ధమాకా డప్పు వాయిద్యకారుల యూనియన్ అధ్యక్షుడు

మధుర వదన.. నళిన నయన



దివ్యాలంకృతుడైన వాసుదేవ స్వామి

మందస: తిరుమల–తిరుపతిలోని వేంకటేశ్వరుడిని తలపించేలా మందసలోని వాసుదేవ పెరుమాళ్‌ను పండితులు శనివారం సుందరంగా అలంకరించారు. స్వామి బ్రహ్మోత్సవాలు ఇటీవల వైభవంగా ముగియగా.. మళ్లీ వారం రోజుల అనంతరం స్వామిని దివ్యాలంకృతుని గావించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు వాసుదేవుని దర్శించుకుని తన్మయత్వానికి గురయ్యారు.

దారి తప్పిన బుల్లి ఎలుగు



తోటల్లోకి వెళ్లడానికి మొరాయిస్తున్న ఎలుగుపిల్ల

మందస: ఎలుగు పిల్లలు ఊళ్లలోకి వచ్చేస్తున్నాయి. స్థానికులు మాత్రం వీటికి ఎలాంటి హాని తలపెట్టకుండా తిరిగి అడవిలోకి విడిచిపెడుతున్నారు. బహడపల్లి గ్రామంలోకి శనివారం ఎలుగు పిల్లలు ప్రవేశించాయి. తోటల్లోకి పంపడానికి ప్రయత్నించగా, వెళ్లడానికి మొరాయించాయి. దీంతో స్థానికులు వాటికి సపర్యలు చేసి.. ఆకలి తీర్చి తోటల్లోకి తీసుకెళ్లి విడిచిపెట్టారు.

శ్రీకూర్మనాథాలయం అమృతాలయం



శ్రీకూర్మనాథాలయంలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి

గార: శ్రీకూర్మనాథాలయం అమృతాలయమని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి అన్నారు. ఆయన శనివారం సాయంత్రం శ్రీకూర్మనాథుడిని దర్శించుకున్నారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలనంతరం కాసేపు అనుగ్రహభాషణం చేశారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు మంగళాశాసనం అందజేశారు. ఎంపీపీ గొండు రఘురాం, గొండు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ అంధవరపు బాలకృష్ణమూర్తి, ఆలయ ఈఓ జి.గురునాథం, పాలక మండలి సభ్యులు డబ్బీరు వాసుదేవరావు, అనుపోజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదిత్యుని సన్నిధికి..

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి సన్నిధికి ప్రసిద్ధ కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆదివారం వచ్చి.. ఉదయం తొలి పూజల్లో పాల్గొననున్నట్లుగా ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు తెలియజేశారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తుల సర్వదర్శనాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని వారు వివరించారు.

ఏఓబీలో చెక్‌పోస్టు ఏర్పాటు



లొద్దపుట్టి చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ శివరామిరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయం సమీపంలో పోలీసులు తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం రూరల్ ఎస్ఐ కె. రామకృష్ణ తన సిబ్బందితో కలసి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికలు సందర్భంగా అక్రమంగా డబ్బులు, మద్యం వంటివి తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి చెక్‌పోస్టును తనిఖీ చేస్తూ, ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎన్నికలు జరిగే వరకు తాత్కాలిక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తామన్నారు.

ఎంసీఎం కమిటీ ఏర్పాటు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక సంస్థల, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఎన్నికల కోసం ఎంసీఎం కమిటీ(మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో చాంబర్ కూడా కేటాయించారు. కమిటీలో మొత్తం ఏడుగురు సభ్యులు ఉంటారు. శ్రీకాకుళం జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, భారత క్షేత్ర ప్రచార విభాగం అధికారి, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి, జర్నలిజం ఆచార్యులు, జిల్లాలో ఒక పాత్రికేయుడిని సభ్యులుగా నియమించారు. వార్తలు, ప్రకటనలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.

కిడ్నీ పరీక్షలు చేయించుకోవాల్సిందే



మందులు అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అనురాధ

సోంపేట: ఉద్దానం ప్రాంతంలో ప్రతి వ్యక్తి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్ఓ బి.మీనాక్షి సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పరీక్షలు చేయించుకుంటే కిడ్నీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. దీంతో ప్రభుత్వం అందజేసే మందులతో నయం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. జిల్లా అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎం.అనురాధ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డాక్టర్ సలహాలు లేకుండా పెయిన్ కిల్లర్ మాత్రలు వాడవద్దన్నారు. వేడి నీరు తాగాలన్నారు. మొత్తం 300 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము, ఎంపీడీఓ బి.వెంకటరమణ, తహసీల్దార్ ప్రసాద్, సర్పంచ్ బి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల గెలుపే.. సార్వత్రిక విజయానికి నాంది

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును పరిచయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్. చిత్రంలో ఎమ్మెల్సీ దువ్వాడ, తిలక్, కృపారాణి తదితరులు

టెక్కలి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన అభ్యర్థుల గెలుపే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి నాంది అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు పరిచయ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం టెక్కలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. మార్చి 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరచిన సీతంరాజు సుధాకర్‌ను, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును గెలిపించేందుకు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులంతా సమష్టిగా పనిచేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి మండలంలో నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా యాదవ సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ రామారావుకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ విశాఖలో రాజధాని ఏర్పాటు అంశానికి సీతంరాజు సుధాకర్ గెలుపును రెఫరెండంగా తీసుకోవాలన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, జెడ్పీటీసీ దువ్వాడ వాణి వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థుల విజయానికి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయం కోసం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఆట్ల సరోజనమ్మ, నడుపూరు శ్రీరామ్మూర్తి, నాయకులు చింతాడ గణపతి, టి.జానకిరామయ్య, బి.హరి, ఎస్.సత్యం, కె.గోవింద్, ఎం.అప్పారావు, బి.మురళి, కె.బాలకృష్ణ, కె.ధర్మారావు, ఎస్.మోహన్, పి.వైకుంఠరావు, డి.రంగబాబు, పి.సంతోష్, కె.శ్రీనివాస్, కె.అజయ్, బి.తులసీరావు, ఎన్.భీమారావుతో పాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

గార: ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కొర్ని, కొర్లాం సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా పనులు ఎంపిక, అమలుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. సర్పంచ్ పీస గోపి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయగా, దీనిపై ప్రభుత్వానికి తెలియజేస్తామని కలెక్టర్ బదులిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, సర్పంచ్, మండల పార్టీ కన్వీనర్ పీస శ్రీహరిరావు పాల్గొన్నారు.

రెస్టారెంట్లలో తనిఖీలు



నూనె నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో ఆహారభద్రతా అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. రెండు చోట్ల కేసులు నమోదు చేశారు. మెయిన్ రోడ్డులోని డీసీసీబీ బ్యాంక్ పక్కన ఉన్న హాట్ చిప్స్ తయారీ కేంద్రంతోపాటు హేంగ్ అవుట్ రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టారు. రెండు చోట్లా నాణ్యత లేని ఆయిల్ వాడుతున్నట్లు నిర్ధారణ అయిందని, కేసులు నమోదు చేశామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కె.వెంకటరత్నం తెలిపారు. నాణ్యత పరిశీలన యంత్రం ద్వారా వినియోగిస్తున్న ఆయిల్‌ను తనిఖీ చేశామని, నాణ్యత లేని నూనెగా గుర్తించామన్నారు. పదేపదే ఆయిల్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే బాలబాలికలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అధికారులకు సూచించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో టెన్త్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు, ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. నేలరాతలు జరగకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని, వేసవి తాపం నేపథ్యంలో తాగునీరు, నిరంతరం విద్యుత్, తరగతి గదుల్లో ఫ్యాన్లు, వెలుతురు, మరుదుదొడ్లు పక్కాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యఆరోగ్యశాఖ, రవాణాశాఖ, పోలీసుశాఖ, విద్యుత్‌శాఖ, సచివాలయం వ్యవస్థలంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఈఓ గార పగడాలమ్మ మాట్లాడుతూ జిల్లా నుంచి 29575 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. ఇందులో బాలురు14,770 మంది, బాలికలు14085 మంది ఉన్నారని చెప్పారు. ప్రైవేటుగా 456 మంది బాలురు, 264 మంది బాలికలు హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ, విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్, ధర్మాన సీతారాములు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

ఇంటర్‌లో ప్రవేశాలకు.. ఓపెన్ ఆఫర్



ఓపెన్ స్కూల్ తరగతుల్లో విద్యార్థులు

- ఇంటర్మీడియెట్ చదువుతూ మధ్యలో మానేసిన వారికి అవకాశం
- ఈ నెల 27 వరకు జూనియర్ కళాశాలల్లో దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాల కోసం ప్రభుత్వం 'ఓపెన్' ఆఫర్ ఇచ్చింది. ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్మీడియెట్ ప్రవేశాల కల్పనకు అద్భుత అవకాశం కల్పించింది. టెన్త్‌క్లాస్ ఉత్తీర్ణులై వివిధ యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్‌లో చేరి వివిధ కారణాలతో మధ్యలో మానేసిన(డ్రాపౌట్లు) విద్యార్థులకు మేలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డ్రాపౌట్లను గుర్తించే పనిలో నిమగ్నం..

ప్రభుత్వం ఇచ్చిన ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ ప్రవేశాల కల్పనకు సంబంధించి జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారులు తగిన మార్గదర్శకాలను జారీ చేశారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో 2021–2023 మధ్య ఇంటర్మీడియెట్ చదువుతూ వివిధ కారణాలతో చదువు నిలిపివేసిన విద్యార్థులను గుర్తించే పనిలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు నిమగ్నమయ్యారు. చదువు మధ్యలో ఆపేయడానికి గల కారణాలను తెలుసుకుని, ఓపెన్ స్కూల్ ఇంటర్ ఆఫర్ గురించి వివరిస్తున్నారు.

27 వరకు ప్రవేశాల కల్పన..

మరో మూడు నెలల్లో ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రవేశాల కల్పన సువర్ణ అవకాశమనే చెప్పాలి. 2021–23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో చదువుతున్న డ్రాపౌట్లుగా ఉన్న విద్యార్థులు జిల్లాలో 205 జూనియర్ కళాశాలల్లో 1804 మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ ప్రవేశాలు పొందవచ్చు. జూనియర్ కళాశాలను సంప్రదించి అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. ఈ నెల 27లోగా పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలి.



ఓపెన్ స్కూల్ వెబ్‌పోర్టల్

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్మీడియెట్ చదువుతూ డ్రాపౌట్లుగా ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం గొప్ప అవకాశాన్ని కల్పించింది. అతితక్కువ ఫీజుతో ఓపెన్ స్కూల్ ఇంటర్‌లో ప్రవేశాలను కల్పిస్తాం. కేవలం రెండు మూడు నెలల్లో అభ్యాసంతోపాటు ఇంటర్మీడియెట్ పూర్తిచేసుకోవచ్చు. పూర్తి వివరాలకు సమీపంలోని జూనియర్ కళాశాలను గానీ ఏపీఓపెన్ స్కూల్.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌ను గానీ సంప్రదించవచ్చు.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా డీవీఈఓ

నేటి నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్



స్ట్రీమింగ్ విధానం ద్వారా ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌ఐఓ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ప్రయోగ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 19471 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ఎంపీసీ నుంచి 13165 మంది, బైపీసీ నుంచి 6306 మంది విద్యార్థులు ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు నేతృత్వంలోని డీఈసీ కమిటీ సభ్యులు ఆర్.భూషణరావు (ప్రిన్సిపాల్–జీజేసీ బూర్జ), పీపీఎల్ నారాయణరావు (ప్రిన్సిపాల్–జీజేసీ ఎచ్చెర్ల), డి.ఫల్గుణరావు (జేఎల్– జీజేసీ పొందూరు) ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, నాన్ జబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాలను కేటాయించారు. అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమిషనరేట్, జిల్లా ఆర్‌ఐఓ కార్యాలయానికి స్ట్రీమింగ్ చేశారు. స్ట్రీమింగ్ పనితీరును శనివారం ఆర్‌ఐఓ తవిటినాయుడు కార్యాలయంలో పరిశీలించారు. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లంతా సమన్వయంతో వ్యవహరించి ప్రాక్టికల్స్ పూర్తి చేయాలని ఆర్‌ఐఓ ఆదేశించారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు..

ప్రాక్టికల్ పరీక్షల హాల్‌టికెట్ల మంజూరులో జాప్యం, ఏర్పాట్లలో లోపాలు తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఆర్‌ఐఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. వివరాలకు 08942–295933(ల్యాండ్‌లైన్), 8639313490 నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బొలేరోవ్యాన్

టెక్కలి రూరల్: పశువుల అక్రమ రవాణాను టెక్కలి పోలీసులు శనివారం అడ్డుకున్నారు. కంచిలి ప్రాంతం నుంచి చల్లపేట సమీపంలోని నారాయణవలస సంత వైపు బొలేరో వాహనంలో ఆవులను అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందుకున్న టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ సిబ్బందితో వెళ్లి జగతిమెట్ట వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఏపీ31టీహెచ్ 4278 నంబర్ గల వ్యాన్‌లో ఆరు ఆవులను ఇరుగ్గా తీసుకు వెళ్తున్నట్లు గుర్తించానార్లు. సారవకోట మండలం అడ్డవనస గ్రామానికి చెందిన కరగాన రాజు, కోటబొమ్మాళి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన సీహెచ్ సుధాకర్‌లను అదుపులో తీసుకున్నారు. గోవులను అక్రమ రవాణకు ప్రయత్నించిన ఇరువురిపై కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆవులను విజయనగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించినట్లు చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



బుడారిసింగిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

మందస: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.గణపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోగారావు సిబ్బందిని ఆదేశించారు. శనివారం బుడారిసింగి, పాతకోట, సిరిపురం, సరియాపల్లి, అలెఖ్యనగర్ తదితర గ్రామాల్లో జగనన్న కాలనీల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఐదు లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందివ్వాలన్న ధ్యేయంతో నిర్మాణాలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేయాలని, పర్యవేక్షణ బాధ్యతలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనంతరావు, అసిస్టెంట్ ఇంజినీర్ గార రామ్మోహనరావు, సర్పంచ్ సురేష్‌కుమార్ పాణిగ్రాహి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కవిటి అశోక్‌కుమార్, పైల సతీష్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అమృత్ మహోత్సవ్ ర్యాలీ



500 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



అమృత కలశాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

నరసన్నపేట: బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శనివారం నరసన్నపేటలో నిర్వహించిన స్వాతంత్ర్య అమృత మహోత్సవ ర్యాలీ ఆకట్టుకుంది. అమృత కలశాలతో బ్రహ్మ కుమారీలు, జాతీయ జెండాలతో హోం శాంతి సభ్యులు, 500 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థులు చేపట్టిన ర్యాలీ ఆద్యంతం దేశ భక్తిని చాటేలా కొనసాగింది. ఎంపీడీఓ కార్యాలయం నుంచి పెద్దపేటలోని హోం శాంతి భవనం వరకూ ర్యాలీ చేపట్టి.. అనంతరం స్థానిక కల్యాణ మండపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎ.సింహాచలం, ఎంపీడీఓ మధుసూదనరావులు మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడాలని, మహిళలే నూతన భారతావనికి ధ్వజ స్తంభాలని చెప్పారు. ఆత్మస్థైర్యంతో ఆరోగ్య భారత దేశాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు ఈశ్వరి, బాలామణి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



పోలింగ్ గదిని పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎన్నికల పరిశీలకుడు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కె.శ్యామలరావు అధికారులకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్న శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను శనివారం పరిశీలించారు. బ్యాలెట్ ఆధారంగా ఎన్నికలు జరగనున్నాయని, పూర్తిస్థాయి వెలుతురు, ఎండ తీవ్రత రక్షణకు టెంట్లు వంటివి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సజావుగా ఎన్నికలు జరిగేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ నవ్య, ఆర్‌డీవో శాంతి, డీఎస్పీ మహేంద్ర, తహశీల్దార్ టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

బొలెరో ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన ఈశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నవనంబాడు గ్రామానికి చెందిన అల్లు ఈశ్వరావు (55) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన డీజిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. చింతాడ ఎఫ్‌సీఐ గోదాం పరిసర ప్రాంతంలో మోటార్ పనిచూసుకుంటూ కాలినడకన ఇంటికి వస్తుండుగా కె.మన్నయ్యపేట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఆటోను తప్పించబోయి ఈశ్వరరావును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన వారిని 108లో రిమ్స్‌కు తరలించారు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్లో) మృతి చెందిన నారాయణరెడ్డి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీ వరిసాం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ చిల్లా నారాయణరెడ్డి(36) మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిల్లపేటరాజాంకు చెందిన నారాయణరెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పదేళ్లుగా పైడిభీమవరంలోనే నివాసం ఉంటున్నాడు. వరిసాం గ్రామానికి చెందిన మూర్తిరాజు ఇంట్లో ఎలక్ట్రికల్ పని నిమిత్తం శనివారం ఉదయం 10 గంటల సమయంలో పైడిభీమవరం సబ్ స్టేషన్ లైన్‌మేన్ ద్వారా ఎల్‌సీ తీసుకున్నాడు. వరిసాం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్ లాగుతుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నారాయణరెడ్డికి ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

పొందూరు: పాన్‌షాపు బాకీ విషయంలో జరిగిన వివాదం కొట్లాటకు దారితీసి ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు పాత ఎస్‌బీఐ ఎదురుగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్న అమ్మినాయుడుకు నూక శ్యామసుందర్ రూ.350 బాకీ ఉన్నారు. దీనిపై వివాదం రావడంతో శుక్రవారం రాత్రి 9 గంటల తరువాత దుకాణానికి శ్యామ్‌సుందర్‌తో పాటు పి.రాము, పి.స్వాతికుమార్, బి.పవన్‌లు వెళ్లారు. దుకాణదారుడి కుమారుడు మహేష్‌బాబుకు వీరికి వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో ఇంటిలో ఉన్న అమ్మినాయుడు కత్తితో దాడిచేయడంతో శ్యామ్‌సుందర్, పవన్‌లకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న పేడాడ శ్యామలరావు అడ్డుకునే ప్రయత్నంలో చాకు అతని పొట్టలో దిగింది. తీవ్రగాయాలు కావడంతో ముగ్గురినీ పొందూరు సీహెచ్‌సీకి అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు 108 వాహనంలో తరలించారు. నూక శ్యామ్‌సుందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుకాణం యజమాని చౌదరి అమ్మినాయుడు, అతని కుమారుడు మహేష్‌బాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. కాగా, బాకీ సొమ్ము అడగడంతో రాత్రివేళ ఇంటికి వచ్చి తమను తీవ్రంగా గాయపరిచారని, ఆత్మరక్షణ కోసమే అడ్డుకున్నామని అమ్మినాయుడు పోలీసులకు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



ఆమదాలవలస: గాయపడిన సూర్యం



ఎల్.ఎన్.పేట: సంఘటన స్థలంలో బాలరాజు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం రైలు నుంచి జారిపడిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొండ మండలం వెలగవాడకు చెందిన పరిమళ సూర్యం తన బంధువుల ఇంటికి తుని వెళ్లేందుకు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరేందుకు ఆమదాలవలస స్టేషన్‌కు వచ్చాడు. మూడో నెంబర్ ప్లాట్‌ఫాంలో ఉన్న రైలు ఎక్కి అది బయలుదేరిన తర్వాత విశాఖ ఎక్స్‌ప్రెస్ కాదని తెలుసుకుని హడావుడిలో కిందకు దూకేశాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో 108వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..

ఎల్.ఎన్.పేట: మండలంలో మోదుగువలస–స్కాట్‌పేట గ్రామాల మధ్య ఏబీ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సతివాడ గ్రామానికి చెందిన పోతుల బాలరాజుకు గాయాలయ్యాయి. బాలరాజు ద్విచక్ర వానంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొనడంతో ఈ ఘటన జరిగింది. వెంటనే స్థానికులు108 ద్వారా క్షతగాత్రుడ్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని..

కాశీబుగ్గ: పలాస మండలం గరుడఖండి–గూలూరు గ్రామాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన సప్ప నీలాచలం హైదరాబాద్‌లో పోలీసుగా పనిచేస్తున్నారు. సెలవుపై వచ్చిన ఆయన పలాస రైల్వే రిజర్వేషన్ సెంటర్‌కు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా బస్సు, కారు వెనువెంటనే రావడంతో రోడ్డు పక్కకు దిగిపోయాడు. ఈ క్రమంలో అక్కడున్న విద్యుత్ స్తంభం తగిలి తీవ్రంగా గాయపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ మేఘన అత్యవసర సేవలు అందించి రిమ్స్‌కు రిఫర్ చేశారు.